వణికిస్తున్న పుల్లవ డ్రెయిన్

- డ్రెయిన్‌లో పేరుకుపోయిన కిక్కిస
- కైకలూరు – గోపవరం గ్రామ రహదారిపై డ్రెయిన్ నీరు
- ఆక్రమణలు తొలగించాలని స్థానికుల వినతి

కైకలూరు: పుల్లవ డ్రెయిన్ ప్రజలను వణికిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొంగి పొర్లింది. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో కిక్కిస తొలగించని కారణంగా రహదారులపై నీరు ప్రవహిస్తోంది. ముంపు సమస్య తగ్గి పది రోజులు గడుస్తున్నా పుల్లవలో నీరు మాత్రం ప్రవహిస్తోంది. దీంతో దీని సమీప కాలనీలు, రహదారులపై నుంచి నీరు పారుతోంది. ప్రతి ఏటా ఈ డ్రెయిన్ కారణంగా ముంపు బారిన పడుతున్నా ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు.


పుల్లవ డ్రెయిన్ పొంగటంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

తూములు పూడుకుపోవడంతో సమస్య

నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్లలో పుల్లవ ఒకటి. ఇది కైకలూరు మండలం ఆచవరం నుంచి ఆలపాడు మీదుగా ఉప్పుటేరులో కలుస్తోంది. ఆచవరం, గోపవరం, ఆటపాక అగ్రహారం, వదర్లపాడు బ్రాంచీ, పల్లెవాడ, ఆలపాడు మీదుగా ప్రవహిస్తోంది. ఇటీవల వరదలకు కైకలూరు – గోపవరం రహదారిపై నుంచి పుల్లవ ప్రవహించడంతో రాకపోకలు అనేక రోజులుగా నిలిపివేశారు. ఇప్పటికీ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. అదే విధంగా పుల్లవ కారణంగా ఆటపాక నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో జగనన్న కాలనీ నీట మునిగింది. ప్రధానంగా కైకలూరులో వెలంపేట కాలనీలో పుల్లవ కారణంగా ప్రతి ఏటా మూడు అడుగుల నీరు చేరుతోంది. కాలనీ సమీపంలో రైల్వేట్రాక్ కింద నుంచి తూముల ద్వారా పుల్లవలోకి నీరు చేరాలి. తూములు కొన్ని పూడుకుపోవడంతో సమస్య ఏర్పడుతోంది.

పల్లపు ప్రాంతాలు మునక..

పుల్లవ డ్రెయిన్ 16 కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రవహిస్తోంది. డ్రెయిన్‌కు ఇరువైపులా ఎక్కువగా ఆక్వా చెరువులు ఉన్నాయి. అనేక చోట్ల డ్రెయిన్ ఆక్రమణకు గురైంది. కిక్కిస ఎక్కువగా పెరగడంతో నీటి ప్రవాహం స్తంభించింది. దీంతో నీరు ఎగదన్ని పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతోంది. వర్షాలు పడినప్పుడు మాత్రమే అధికారులకు మరమ్మతులు గుర్తుకొస్తున్నాయని ముందుగానే ప్రణాళికతో కిక్కిస తొలగింపు చేయాలని రైతులు కోరుతున్నారు. అదే విధంగా నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన రాళ్లకోడు డ్రెయిన్ ఆక్రమణలకు గురైంది. ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో రాళ్లకోడు ఆక్రమణలపై ఫిర్యాదులు చేశారు.

పుల్లవ డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి



పుల్లవ డ్రెయిన్‌లో విపరీతంగా కిక్కిస పెరిగింది. ఇటీవల వర్షాలకు నీటి ప్రవాహం లేదు. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయి. ప్రధానంగా పుల్లవ డ్రెయిన్ ఆక్రమణలకు గురైంది. జిల్లా స్థాయి అధికారులు పుల్లవ ఆక్రమణలను తొలగించాలి. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

– బండి శ్రీనివాసరావు, సామాజిక సేవా కార్యకర్త, ఆలపాడు

మురళీకృష్ణ సేవలు అభినందనీయం

పామర్రు: ఘంటసాల కళాపీఠం ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కాటూరి వెంకట మురళీకృష్ణ సేవలు అభినందనీయమని పామర్రు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొగ్గరపు జాలయ్య పేర్కొన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాపీఠం ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే 100కు పైగా పలు రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించడమే కాకుండా కళాకారులకు సన్మాన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని చెప్పారు. పద్మశ్రీ ఘంటసాల పాడిన పాటలను మధురంగా ఆలపించి ఎంతో మంది చేత మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణకు జూనియర్ ఘంటసాలగా బిరుదు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు బొగ్గరపు సాయిబాబు, ఘంటసాల త్రినాథ్, తాళ్లూరి నరేష్, బొమ్మిశెట్టి శ్రీధర్, తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మురళీకృష్ణను సన్మానిస్తున్న జాలయ్య తదితరులు

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

గుడివాడటౌన్: ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కైకాల కళామందిరం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక విధానాలు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా వివిధ ఉత్పత్తులు తయారుచేసి విక్రయిస్తూ సంఘాలు ఆర్థిక ఎదుగుదలకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మొత్తం 40 సంఘాల ఆధ్వర్యంలో ఈ అర్బన్ మార్కెట్‌లో విక్రయాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం, సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం...

గుడ్లవల్లేరు: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. కౌతవరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఇది మంచి ప్రభుత్వం పేరిట గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. టీడీపీ నాయకులు శాయన పుష్పావతి, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, తూము పద్మజ, ఈడె కృష్ణారావు, వడ్లమూడి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

క్లుప్తంగా

రేషన్ షాపుల్లో సబ్సిడీపై ఉల్లిపాయలు విక్రయించాలి

మండవల్లి: మార్కెట్‌లో కిలో ఉల్లిపాయల ధర రూ.75కు చేరాయని, పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై ఉల్లిపాయలు విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు డిమాండ్ చేశారు. మండవల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉల్లి ధర పేదలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉల్లి ధర రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.75, 80, 90కి చేరిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉల్లి ధరలు సబ్సిడీ రేట్లకు చౌక ధరల దుకాణాల ద్వారా అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత



మోపర్రు(పెదపారుపూడి): ఇటీవల బుడమేరు వరదల్లో నష్టపోయిన మండలంలోని మోపర్రు గ్రామస్తులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వంట పాత్రల కిట్లు, టార్పాలిన్‌లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ద్వారా వరద బాధితులకు తమవంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. వరద బాధితులకు దాతలు ఆపన్నహస్తం అందించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొండపల్లి రాంబాలాజీ, శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

గుడివాడరూరల్: మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు గురువారం బదిలీ అయ్యారు. దొండపాడు పంచాయతీ కార్యదర్శి ఎన్.స్నేహలత పామర్రు మండలం కొమరవోలు గ్రామానికి, చౌటపల్లి కార్యదర్శి పెదమద్దాలి గ్రామానికి, శేరీగొల్వేపల్లి గ్రామ కార్యదర్శి ముదినేపల్లి మండలం పెయ్యేరుకు, మల్లాయపాలెం కార్యదర్శి వి.హరికృష్ణ బిళ్లపాడు గ్రామానికి బదిలీ అయ్యారు. వీరితో పాటు నందివాడ కార్యదర్శి కొడాలి రామ్మోహనరావు బొమ్ములూరు గ్రామానికి, ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామ కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి దొండపాడుకు, నందిగామ కార్యదర్శి జి.మస్తాన్‌రావు శేరీగొల్వేపల్లి కార్యదర్శిగా, రాజోలు మండలం శివకోటి పంచాయతీ కార్యదర్శి బి.కోటయ్య మల్లాయపాలెం కార్యదర్శులుగా బదిలీ అయ్యారు. వీరు త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇళ్ల మధ్య వ్యర్థాలను తొలగించండి



గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డు అలంకృత ఫంక్షన్ హాలు సమీపంలోని ఇళ్ల మధ్య కోళ్ల వ్యర్థాలు వేయడంతో, అవి కుళ్లి కంపుకొడుతున్నాయని వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చికెన్ సెంటర్ల నుంచే వ్యర్థాలను మూటలు కట్టి రోడ్డుకు ఇరువైపులా వేసి వెళ్లి పోతున్నారని దీంతో కంపుకొడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీటికి తోడు తాగేసిన కొబ్బరి బోండాలను ఇదే ప్రాంతంలో వదిలివేయడంతో వాటిలోకి వర్షపు నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలోని ప్రజా సమస్యల పట్ల పని చేసేటపుడు తమ విధి నిర్వహణలో ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ, ఎంఆర్ఐ షకీలాబేగం అంకితభావంతో కృషి చేశారని మండల వీఆర్వోల సంఘాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఘంటసాలకు కనకదుర్గ, మచిలీపట్నం కలెక్టరేట్‌కు బదిలీ అవుతున్న షకీలాబేగంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు శాయన ప్రకాష్, పురిటిపాటి రవి, సనకా భాస్కరరావు, మల్లికార్జునరావు, రామ్మూర్తి, రమేష్, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలంటూ ర్యాలీ

కోడూరు: బాల్య వివాహాలను అరికట్టాలంటూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి

గుడివాడటౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.పద్మావతి తెలిపారు. ఈ నెల 25న నూజివీడులో జరిగిన జిల్లా టీమ్ ఎంపికలో తమ విద్యార్థులు అండర్–14 విభాగంలో జి.రాకేష్, అండర్–17 విభాగంలో షేక్ అబ్దుల్ రహమాన్‌లు తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జట్టుకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.శ్రీనివాస్, ఎం.సత్య అన్వేష్‌లను మాంటిస్సోరి ప్రెసిడెంట్ వి. లక్ష్మి, కరస్పాండెంట్ పీవీవీ రామదుర్గ, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో గౌతమ్‌స్కూల్ యాజమాన్యం

కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కృష్ణాజిల్లా తరుపున ఆడేందుకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ నూజివీడులో జరిగిన జిల్లా క్రీడాకారుల ఎంపికలో అండర్–14 విభాగంలో ఎ.ధృతి, కేవీ భాషిత(స్టాండ్‌బై), అండర్–17 విభాగంలో జి. ప్రణతి, కె రుత్విక(స్టాండ్‌బై)లు తమ ప్రతిభను ప్రదర్శించి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, కోచ్ మడకా సత్య అన్వేష్, కళాశాల ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, జ్యోతి, ప్రశాంతిలు అభినందించారు.

ఇరుకు గదుల్లో పోస్టాఫీస్



మండవల్లి: మండవల్లిలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న పోస్టాఫీస్ ఇరుకు గదులతో అసౌకర్యంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పది మంది పోస్టాఫీస్‌లో కూర్చుని లావాదేవీలు జరపాలంటే వీలు పడడం లేదని వాపోతున్నారు. పోస్టాఫీస్‌కు స్థానిక సెంటర్‌లో సుమారు 20 ఏళ్ల కిత్రమే గ్రామ పంచాయతీ తాగు చెరువు గట్టు పక్కన 10 సెంట్ల స్థలం కేటాయించింది. అక్కడ ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం జరగలేదు. స్థలం ఉన్నా పోస్టాఫీస్ అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా పోస్టల్ ఉన్నతాధికారులు స్పందించి పోస్టాఫీస్‌కు సొంత భవనం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

స్వచ్ఛతా హీ సేవపై కళాజాతా


కాజలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాజ(మొవ్వ): కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలజీ ఆదేశాల మేరకు మొవ్వ మండలం కాజ గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు సాయి కృష్ణ, వీరయ్యలు తడి చెత్త, పొడి చెత్త వినియోగంపై, ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


వెంట్రప్రగడలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ పంచాయతీ కార్యాలయం వద్ద రవితేజ కళాతా బృందం వీరయ్య ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వచ్చే రోగాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కైకలూరు: దోమలు కుట్టకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కై కలూరు సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్.శ్రీనివాస్ చెప్పారు. నియోజకవర్గంలో కైకలూరు మండలం ఆలపాడు, మండవల్లి మండలం ఉనికిలి, నాగభూషణపురం వరద ప్రాంతాల్లో ఫీవర్, లార్వా సర్వేలను గురువారం నిర్వహించారు. డ్రెయిన్లలో దోమలు వృద్ధి చెందకుండా ఎబేట్ మందును పిచికారీ చేయించారు. ప్రతి ఇంటికీ వెళ్లి తాగునీటి బిందెలపై మూతలు పెట్టుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. తాగిపడేసిన కొబ్బరి బోండాలు, వాడిపడేసిన టైర్లు, కుండీలు, ఫ్లవర్‌వాజ్, ప్లాస్టిక్ బకెట్లు, రుబ్బురోళ్లలో నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కరుణ, హెల్త్ అసిస్టెంట్ సురేష్, నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేష్, ఏఎన్ఎంలు జానికమ్మ, సీతామహాలక్ష్మి ఆశవర్కర్లు కుమారి, శ్వేత, స్వర్ణలత, శైలజా, కృపారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆలపాడులో నిల్వ నీటిని పరిశీలిస్తున్న శ్రీనివాస్, సిబ్బంది

సామూహిక సీమంతాలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని శ్రీహరిపురం శివారు చేవూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ప్రసూన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ ప్రసూన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పప్పు దినుసులు, ఆకు కూరలు, పాలు, కోడిగుడ్లు వంటి పోషకాహారాలను తీసుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైవీ అప్పారావు, ఉపాధ్యాయురాలు ఎ.అరుణ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


చేవూరుపాలెంలో సీమంతం నిర్వహిస్తున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు, అంగన్‌వాడీ సిబ్బంది

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లో వేం చేసి ఉన్న శ్రీ షిర్డీ సాయినగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కాగడా హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామికి విశేషంగా పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకాలను చేశారు. అనంతరం సాయిబాబాకు శత సహస్ర నామాలతో పూజాధికాలను జరిపించారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను అర్చకులు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సాయి భక్త సమాజ సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కాశి, సాంబశివరావు, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


విశేష అలంకరణలో సాయిబాబా

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

పామర్రు: నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మెమోరాండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న పలు సమస్యలను అర్జీ రూపంలో కలెక్టర్‌కు అందజేశామన్నారు. ఈ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటానని తెలిపారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నాయకులు వల్లూరిపల్లి గణేష్, లింగమనేని రామలింగేశ్వరరావు, ప్రకాష్ తదితరులు ఉన్నారు.


జిల్లా కలెక్టర్ బాలాజీని కలిసిన ఎమ్మెల్యే కుమార్ రాజా, నాయకులు

విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండి మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని మచిలీపట్నం మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు జి.రమేష్‌బాబు, మస్తాన్‌ఖాన్ అన్నారు. స్థానిక రుస్తుంబాదలోని ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బాలలపై లైంగిక నేరాలు, బాల్యవివాహాలు, వాటికి పడే శిక్షల వివరాలను వారు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నేరాల దరిచేరకుండా చదువే పరమావధిగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. గల్లంతే !


శిథిలమైన బెయిలీ వంతెన


కాజలో ప్రమాదకరంగా పాత వంతెన

మొవ్వ మండలంలోని మేజర్ పంచాయితీల్లో ఒకటైన కాజ గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ ప్రారంభంలోని అయినంపూడి డ్రెయిన్‌పై ఉన్న వంతెనలు రెండు శిథిలావస్థకు చేరున్నాయి. ఈ వంతెనలపై ప్రయాణం.. ఆదమరిస్తే.. గల్లంతే అనే రీతిలోకి మారాయి. దశాబ్దాల క్రితం వేసిన వంతెన శిథిలమవ్వటం.. తాత్కాలిక రాకపోకలకు బెయిలీ బ్రిడ్జి(ఇనుప) వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే ఈ వంతెనలు నేడు పూర్తిగా శిథిలమైంది. అయినంపూడి డ్రెయిన్ కొంత కాలంగా నిండుకుండలా ప్రవహించటం.. వంతెనలకు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడటంతో ఈ వంతెనల మీద ప్రయాణం ఓ సాహసంగా మారింది. వంతెనలకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా నూతన వంతెనలను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కాజ(మొవ్వ)

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



కైకలూరు: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని నియోజకవర్గ ఐలమ్మ రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ కోరారు. స్వాతంత్య్ర సమరయోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ 129వ జయంతిని కైకలూరు కలిదిండి రోడ్డులో గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు రజక సంఘ పెద్దలు మాట్లాడుతూ రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రజకులు వృత్తి నిర్వహించుకునే చెరువులపై శాశ్వత హక్కులు కల్పించేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు. కైకలూరులో ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు, రజక సంఘం నాయకులు గుడికందుల ఏసురత్నం, అంతర్వేది, పెద్దిరాజు, చిర్లంక శ్రీనివాస్, చంటి, బాలాజీ, పవన్, కొండపల్లి నాగేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.